

ఉద్యానానికి.. ఊతమేదీ?
పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం కరువైంది. దీంతో సాగు చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు.
వివరాలు 8లో ▸



ప్రవేశాలపై దృష్టి సారించాలి
ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) హిమబిందు అన్నారు.
వివరాలు 8లో ▸



రారెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌లు
విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో రైతులు కలత చెందుతున్నారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చేసిన పనులతోనే గుర్తింపు

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

హవేళిఘణాపూర్: అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి పనులే గుర్తింపునిస్తాయని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ అధికారం ముగిసిపోతుందని ఎంపీటీసీలు బాధపడాల్సిన అవసరం లేదని, బీఆర్‌ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ ఎంపీటీసీలకు వేతనాలు అందించి ప్రోత్సహించారని గుర్తుచేశారు. అనంతరం ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సుజాత శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాధా కిషన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు హనుమంత్ రెడ్డి, బ్రహ్మం, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు నర్సాపూర్ మండలం నారాయణపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అయిదో తరగతి విద్యార్థులు పి.వరుణిక, పి.జేశ్వంత్ 300మీటర్ల రన్నింగ్ పోటీలో బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని హెచ్‌ఎం చంద్రమణి, ఉపాధ్యాయులు యల్.శ్రీనివాస్ జాదవ్, నుస్రత్, ఎంఈఓ బుచ్యా నాయక్ బుధవారం అభినందించారు.

ఏడుపాయల ఈఓగా కృష్ణ ప్రసాద్



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఈఓగా కృష్ణ ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈఓగా పని చేసిన వినోద్ వేములవాడకు బదిలీ అయ్యారు.


నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న గోవింద్

నర్సాపూర్: ఎరువులు, విత్తనాల డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ హెచ్చరించారు. బుధవారం ఆయన పలు ఎరువులు, విత్తనాలు, రసాయన మందుల దుకాణాలను తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. డీలర్లు లైసెన్సు కలిగి ఉండాలని, ఎరువులను పీఓఎస్ మెషిన్ ద్వారానే అమ్మాలని ఆదేశించారు. స్టాకు, రికార్డులను, విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి దీపిక, విస్తరణ అధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.

రైతుల అంగీకారంతోనే సమీకరణ



మాట్లాడుతున్న అధికారులు

నర్సాపూర్: రైతుల అంగీకరంతోనే భూమిని సమీకరిస్తామని హెచ్‌ఎండీఏ డిప్యూటీ కలెక్టర్ విజయకుమారి చెప్పారు. బుధవారం ఆమె స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి నిబంధనల గురించి వివరించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రణాళికాపరమైన అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ భూ సమీకరణ పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. మూడు ఏళ్లలో లే అవుట్‌గా అభివృద్ధి చేస్తారని, రైతులకు ఎలాంటి ఖర్చులతో సంబంధం ఉండదని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా.. బోధన భళా

విద్యలో బాలికలకు ఆసరా
- జిల్లాలో 15 విద్యాలయాలు
- లక్ష్యానికి మించి ప్రవేశాలు
- ఆరింటిలో 6నుంచి ఇంటర్ వరకు
- మరో నాలుగు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

నిరుపేదలు, అనాథలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల బంగారు భవిష్యత్‌కు కస్తూర్బా విద్యాలయాలు బాటలు వేస్తున్నాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతూ ఉత్తమ విద్యకు ప్రతిబింబాలుగా నిలిచాయి. విద్యతోపాటు మంచి వసతులు కల్పించడంతో వాటిల్లో చేరేందుకు విద్యార్థినులు పోటీపడుతున్నారు. హాస్టల్ వసతి, నాణ్యమైన భోజనం అంత కంటే ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించటంతో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో లక్షానికి మించి ప్రవేశాలు కొనసాగుతున్నాయి. – మెదక్‌జోన్



మెదక్‌లోని కేజీబీవీ పాఠశాల

జిల్లాలోని 15 కేజీబీవీలకు గాను ఆరింటిలో 6వ తరగతి నుండి ఇంటర్ వరకు, తొమ్మిదింటిలో 6 నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్నాయి. గత విద్యా సంవత్సరంలో 8 కస్తూర్బా విద్యాలయాల్లో 100శాతం ఫలితాలు సాధించగా మరో ఏడింటిలో 90శాతానికిపైగా ఫలితాలు వచ్చాయి. అలాగే 6 ఇంటర్ కాలేజీల్లోనూ 70శాతానికి పైగా ఫలితాలు సాధించినట్టు సంబంధిత అధికారులు చెప్పారు.

లక్ష్యానికి మించి ప్రవేశాలు

జిల్లాలోని కస్తూర్బాల్లో లక్ష్యానికి మించి ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఒక్కో తరగతి గదిలో 40మంది విద్యార్థినులకు మాత్రమే అడ్మిషన్ ఇవ్వాల్సి ఉంది. కాని చాలా వాటిల్లో 45మందికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. 6నుంచి పదో తరగతి వరకు ఒక్కో పాఠశాలలో 200మంది విద్యార్థినులకు గాను 225 నుంచి 230వరకు చదువుకుంటున్నారు.

కొత్తగా మరో నాలుగు..

జిల్లాలో ఇప్పటికి 15కేజీబీవీలు ఉండగా మరో నాలుగు మండలాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీచేసింది. హవేళిఘణాపూర్, మాసాయిపేట, నార్సింగ్, నిజాంపేట మండలాల్లో వాటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఆయా మండలాల్లో అద్దె భవనాలు దొరక్కపోవడంతో సమీపంలో ఉన్న కేజీబీవీల్లో ప్రవేశాలు తీసుకుంటున్నారు. హవేళిఘణాపూర్ మండలంలోని విద్యాలయంలో అడ్మిషన్లు పూర్తిచేశారు. కాని అక్కడ భవనం దొరకకపోవటంతో ఆ విద్యార్థినులకు కూడా చిన్నశంకరంపేట కస్తూర్బాలోనే బోధిస్తున్నారు. మిగతా మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

చదువుతోపాటు క్రీడలు

కస్తూర్బా విద్యాలయాల్లో చదువుతోపాటు క్రీడలపై దృష్టిసారిస్తున్నారు. ప్రత్యేకంగా పీఈటీ, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ టీచర్స్ ఉన్నారు. బాలికలు కూడా కరాటే, ఇతర క్రీడల్లో రాణిస్తున్నారు. కేజీబీవీల్లో 6నుంచి 10 వరకు బోధించేందుకు కాంట్రాక్టు పద్ధతిన సీఆర్టీలను, ఇంటర్ విద్యార్థులకు బోధించేందుకు పీజీ సీఆర్టీలను నియమించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి స్కూల్‌లో ఒక్కరు చొప్పున ఏఎన్‌ఎంలను నియమించారు. వారు బాలికల ఆరోగ్యంపై ఎప్పటి కప్పుడు ప్రత్యేక శద్ధ చూపుతున్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు కొనసాగుతున్నాయి.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

డీసీఓకు తీర్మాన పత్రాన్ని అందజేసిన డైరెక్టర్‌లు



జిల్లా కోఆపరేటివ్ అధికారి కరుణకు అవిశ్వాస పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్‌లు, నాయకులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై డైరెక్టర్‌లు అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఈ మేరకు బుధవారం జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కరుణకు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందించారు. 13మంది డైరెక్టర్‌లకు గాను గతంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 8మంది డైరెక్టర్‌లు గెలవడంతో చైర్మన్ పదవి దక్కించుకుంది. అందులో ఒకరు అనారోగ్యంతో మృతి చెందారు. అయిదుగురు డైరెక్టర్‌లను గెలుచుకున్న కాంగ్రెస్‌లో ఎన్నికలకు ముందు ఇద్దరు డైరెక్టర్‌లు కలిశారు. ప్రస్తుతం మరో డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీకి మద్దత్తు ఇచ్చేందుకు ముందుకు రాగా వారి బలం ఎనిమిదికి చేరింది. దీంతో కాంగ్రెస్ పార్టీ 8 మంది డైరెక్టర్‌లు కలిసి ఏకగ్రీవ తీర్మానంతో ప్రస్తుత చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టారు. పీఏసీఎస్ చైర్మన్ తమన్ ఏకపక్ష నిర్ణయాలతో సంఘాన్ని నిర్వీర్యం చేయడంతోపాటు, నిధుల దుర్వినియోగం చేస్తున్నారని అవిశ్వాస తీర్మానం అందించినట్లు డైరెక్టర్లు తెలిపారు. ముందుగా నోటీసు జారీచేసి త్వరలో నూతన చైర్మన్ ఎన్నిక చేస్తామని జిల్లా కో–ఆపరేటివ్ అధికారి చెప్పినట్లు డైరెక్టర్‌లు తెలిపారు. అవిశ్వాస పత్రం ఇచ్చిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్‌లు ఆకులపల్లి పాపయ్య, పల్వంచ నరేందర్, నర్సింహారెడ్డి, పులిసత్యనారాయణ, నాయికోటి శ్రీరాములు, సర్వని లక్ష్మి, కలాలి మంగమ్మ, కాట్రోత్ చందర్, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు మాన్‌కిషన్, సత్యనారాయణ, శ్రీధరచారి, భూంరెడ్డి, రాంచందర్, మల్లేశం, రాజేశ్, సాయిలు తదితరులు ఉన్నారు.

రాజీనామా యోచనలో చైర్మన్?

ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న యశ్వంత్‌రెడ్డి డైరెక్టర్‌ల బలం లేనందున ముందస్తుగానే రాజీనామాచేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. చైర్మన్, పార్టీ నాయకులు అవిశ్వాస తీర్మాన విషయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

ఎస్పీ బాలస్వామి



కొత్త చట్టం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ బాలస్వామి, అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందని, జిల్లాలోని పోలీసు అధికారులంతా ఈ కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ బాలస్వామి సూచించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ మహేందర్‌తో కలిసి ఆయన కొత్త చట్టాల పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ చట్టాలను మార్పుచేసి కొన్ని చట్టాలకు సవరణ చేశారన్నారు. కొత్త చట్టాల పుస్తకాలను సిబ్బందికి అందజేశారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించేందుకే ఈ పుస్తకాల పంపిణీ చేశామని చెప్పారు.

చెడు వ్యసనాలబారిన పడొద్దు: జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని గంజాయి, డ్రగ్స్‌కు దూరం ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. బుధవారం మెదక్‌లోని శ్రీచైతన్య భారతి స్కూల్‌లో సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకు కొత్త తరహాల్లో సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ వినతి



మొక్కను అందజేస్తున్న జితేందర్

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో మంజూరైన రూ.20కోట్లకు సంబంధించి టెండర్లు పూర్తికాక పనులు నిలిచిపోయాయని, టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి చర్యలు తీసుకోవాలని ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయన మొక్కను అందజేశారు.

మంజీరా ఐటీఐలో రేపు జాబ్‌మేళా

రామాయంపేట(మెదక్): హైదరాబాద్‌లోని క్యూసేవ్ టెక్నాలజీ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేయడానికిగాను ఉద్యోగుల ఎంపిక కోసం శుక్రవారం స్థానిక మంజీరా ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులు, డిప్లొమా పూర్తి చేసిన వారు ఈ మేళాకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 86395 14294 నంబర్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

ట్రిబుల్‌ఐటీలో చోటు



పావని అక్షిత ముస్కాన్ చైతన్య



భూపాల్ నందిని

చేగుంట(తూప్రాన్)/హవేళిఘణాపూర్(మెదక్): స్థానిక మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీటు లభించినట్లు ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన పావని, అక్షిత, ముస్కాన్ ట్రిపుల్ ఐటీలో సీట్లు దక్కించుకున్నారని తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా మెదక్ మండలం మాచవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చైతన్య ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం నీలకంఠం తెలిపారు. 9.7 సాధించి సెకండ్ లిస్టులో ఎంపికయ్యాడని ఆయన చెప్పారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి..

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం రంగంపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. 2023–24 విద్యా సంవత్సరంలో స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతిలో 9.8జీపీఏ సాధించిన భూపాల్, నందిని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

బంద్ పాటించి సంఘీభావం తెలపాలి

నర్సాపూర్: విద్యా సంస్థలన్ని గురువారం బంద్ పాటించాలని జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం లీకైనా 6న కౌన్సిలింగ్ నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. కౌన్సిలింగ్‌ను రద్దుచేసి మళ్లీ నీట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రం అమ్ముకున్నారని ఆధారాలు ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని వాపోయారు. జిల్లాలోని విద్యా సంస్థలన్ని బంద్ పాటించి తమ నిరసనకు సంఘీభావం తెలుపాలని కోరారు. ప్రభులింగం, రవితేజ, నవీన్, రవి, మహేశ్, విష్ణు, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



ఎంపీపీని సన్మానిస్తున్న లావణ్యరెడ్డి తదితరులు

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెంది ప్రజలు ఆనందంగా ఉండేవారని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి అన్నారు. బుధవారం మెదక్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీటీసీల వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు సరైన సమయంలో విద్యుత్, రైతుబంధు అందజేసి ఆదుకుందన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు రాక రైతులు నానాఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రజలు నమ్మకంతో తమకు పదవులు అప్పగించి సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు సేవలందించిన ఎంపీటీసీలకు ఆమె అభినందనలు తెలిపారు. ఎంపీపీ యమున, వైస్ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలంటూ దివ్యాంగుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెన్షన్లను వెంటనే పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ రూ.6వేలకు పెంచి వెంటనే అమలు చేయాలన్నారు. 2024 జనవరి నుంచి పెరిగిన పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఏడు నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యశోద, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

- సకాలంలో రుణాలు అందజేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్
- జిల్లా వార్షిక రుణప్రణాళిక ఆవిష్కరణ



జిల్లా వార్షిక రుణప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: జిల్లా వార్షిక రుణప్రణాళికలో అత్యధిక భాగం వ్యవసాయానికి కేటాయించామని, సకాలంలో అర్హులైన రైతులందరికీ రుణాలను అందించేలా బ్యాంకర్లు శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బ్యాంకు లింకేజీకి ఉన్న ప్రభుత్వ పథకాలపై బ్యాంకు కంట్రోలర్స్, సంబంధిత శాఖల అధికారి, డీఎల్–ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.5,351కోట్లతో రూపొందించిన వార్షిక రుణప్రణాళికను ఆవిష్కరించారు. ప్రాధాన్యతారంగానికి అత్యధికంగా రూ.4,550 కోట్లు, అప్రాధాన్యతా రంగానికి రూ.802 కోట్లు కేటాయించారు. ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయ రంగానికి రూ.3,166కోట్లు కేటాయించగా, వ్యాపారరంగానికి రూ.1250 కోట్లు, విద్య, గృహనిర్మాణానికి రూ.133 కోట్లుగా ప్రణాళిక సిద్ధం చేశారు. వివిధ బ్యాంకుల ద్వారా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి వివరించారు. సమావేశంలో డీఆర్డీఏపీడీ శ్రీనివాసరావు, డీడీఎం నాబార్డ్ కృష్ణ తేజ, ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పల్లవి, ఎస్‌బీఐ ఏజీఎం అరుణ్ జ్యోతి, యూబీఐ నుంచి వీరరాఘవ, ఏపీజీవీబీ నుంచి ఉదయ్ కిరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ–ఆఫీస్‌తో పారదర్శక పాలన

పారదర్శక పాలన దిశగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. అందులో భాగంగా కలెక్టర్ ఈ–ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఫైల్ ఈ ఆఫీస్ ద్వారా రావాలని అధికారులకు సూచించారు. ఈ ఆఫీసులో సంబంధిత శాఖల అధికారుల డిజిటల్ సంతకంతోపాటు జిల్లా కలెక్టర్ సంతకం ఉంటుందని, క్షణాల వ్యవధిలో సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. పథకాలకు చెందిన ఫైళ్లన్నీ ఈ ఆఫీస్‌లో స్కాన్‌చేసి భద్రంగా ఉంచుతారని, సంబంధిత అధికారి డిజిటల్ సంతకంతో తనకు పంపించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ, బీసీ, ఎస్సీ వెల్ఫేర్, సీపీఓ, సివిల్ సప్లయ్, ఎడ్యుకేషన్, మత్స్యశాఖ, ఉద్యానవన సెరికల్చర్, మెడికల్, మైనార్టీ, పంచాయతీరాజ్ డీఆర్డీఓ, స్త్రీ శిశు సంక్షేమం, జీఎం ఇండస్ట్రీస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ భాగం, ఫారెస్ట్ , వెటర్నరీ శాఖలతో మొదటి విడత ఈ ఆఫీస్ ప్రారంభించామని చెప్పారు. ఆగస్టు 15తో పూర్తిస్థాయిలో ఈ ఆఫీస్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఈ డిస్టిక్ మేనేజర్ సందీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ముందంజ

సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ ముందంజలో ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా కలెక్టర్‌ను కలిసి తమ కార్యకలాపాలపై చర్చించారు. రాష్ట్రంలో మూడు ఆసుపత్రులు, ఎనిమిది రక్తనిధి కేంద్రాలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్‌రావు, యాదగిరి, శ్రీనివాస్ శర్మ, కైలాసం, దామోదరరావు, సత్యనారాయణ, శేషచారి, ప్రభురెడ్డి సుజాత, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రవేశాలపై దృష్టి సారించాలి

డీఐఈఓ హిమబిందు



డీఐఈఓను సత్కరిస్తున్న సంఘ బాధ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) హిమబిందు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో బుధవారం స్థానిక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఐఈఓను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిషన్, బాధ్యులు సత్యనారాయణ రెడ్డి, రాంచంద్రా రెడ్డి, దేవ స్వామి, రాజన్న, వాసవి, ఇందిర, బుచ్చిరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సురేష్‌రెడ్డి, భూపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పటిక బెల్లం పట్టివేత

పలువురిపై కేసు నమోదు



నిందితులను చూపుతున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా ఓ ఆటోలో తరలిస్తున్న పటిక బెల్లంను ఎక్సైజ్ శాఖ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. హుస్నాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ కథనం మేరకు.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన భాషబోయిన లింగం, విజయ, అక్కన్నపేట మండలం చౌటకుంట తండాకు చెందిన భూక్య శంకర్, దూల్మిట్ట మండలానికి చెందిన భానోతు శ్రీనివాస్ కలిసి పటిక సరఫరా చేస్తున్నారు. ఆటో రిక్షాలో తరలిస్తున్న 400 కిలోల పటిక బెల్లంతోపాటు 8 లీటర్ల నాటు సారాను మంగళవారం రాత్రి అక్కన్నపేట మండలంలోని నందారం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నాం. వీరిపై కేసు నమోదు చేయగా శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్, హుస్నాబాద్ ఎస్సై దామోందర్, చేర్యాల ఎస్సై సురేశ్, పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

9 తులాల బంగారం, నగదు అపహరణ



శివ్వంపేట(నర్సాపూర్): పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధి సికింద్లాపూర్ చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దొంతికె మహేశ్, భార్య లావణ్య బుధవారం పిల్లలను పాఠశాలకు పంపించారు. అనంతరం దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం పిల్లలు పాఠశాల నుంచి వస్తారని తాళం చెవి ఆరు బయట ఉన్న బాత్రూంలో దాచి ఉంచారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం చెవి తీసుకొని ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మళ్లీ తాళం చెవి యథావిధిగా పెట్టి వెళ్లారు. పొలం పనులు ముగించుకొని ఇంటికొచ్చిన దంపతులు చోరీ జరిగిన విషయం గుర్తించారు. బీరువాలోని 9 తులాల బంగారం, రూ.20 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు మహేశ్ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు.

ఉద్యానానికి.. ఊతమేదీ?

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం కరువు

- మొక్కలు, డ్రిప్ పరికరాలు నిలిపివేత
- రైతులే కొనుగోలు చేయాలంటున్న ప్రభుత్వం
- జిల్లాలో 727 ఎకరాల్లో సాగుకు 416 మంది దరఖాస్తు
- ఆసక్తి ఉన్నవారికి తప్పని నిరాశ



జిల్లెలగడ్డలో రైతు సాగు చేసిన మామిడి తోట

జాతీయ ఉపాధిహామీ పథకంలో ఉద్యావన పంటలు సాగు చేసుకొని రైతులకు గత ప్రభుత్వంలో పండ్ల మొక్కలను, డ్రిప్ పరికరాలను సబ్సిడీ పై సరఫరా చేసేది. వేసవి కాలంలో ఉపాధి హామీ అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ రైతులకు అవగాహన కల్పించడంతో జిల్లా వ్యాప్తంగా 416 మంది రైతులు 727 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి ముందుకొచ్చారు. ప్రభుత్వం మొక్కలు సరఫరా బాధ్యత నుంచి తప్పుకోవడంతో పండ్ల తోటలను సాగు చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

హుస్నాబాద్ రూరల్: వ్యవసాయానికి అనుబంధంగా పండ్ల తోటలను సాగు చేయించడానికి ఉద్యావన శాఖ అధికారులు, జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేశారు. రెండు శాఖలు సంయుక్తంగా రైతులను ఎంపిక చేసి ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించి సబ్సిడీపై మొక్కలను కొనుగోలు చేసి రైతులకు అందించేది. గిరిజన తండాల ప్రాంతంలో చాల మంది రైతులు రాళ్ల భూముల్లో పండ్ల తోటలను సాగు చేసుకునేవారు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా తోటల సాగు చేయించేవారు. మొక్కలు నాటింది మొదలు మూడేళ్ల వరకు సాగు నిర్వహణ ఖర్చులను ఉపాధిహామీ పథకంలో అధికారులు చెల్లించేది. రాళ్ల భూముల్లో తోటలను పెంచిన రైతులు అంతరు పంటల సాగుతో పాటు వారి భూములను సాగుకు యోగ్యంగా మార్చుకున్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటలు..

మామిడి, నిమ్మ, సపోట, ఆయిల్ పామ్, మునుగ, జామ, ఆపిల్ బేరు, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి, దానిమ్మ లాంటి పండ్ల తోటలను పెంచుకోవడానికి అధికారులు రైతులను ప్రోత్సహించారు. పండ్ల తోటలు పెంచడానికి ముందుకు వచ్చిన రైతులు ఉద్యావనశాఖ ద్వార సబ్సిడీ పైపు లైన్లు, డ్రిప్ పరికరాలు ఇవ్వడంతో చాలా మంది రైతులు వరి, పత్తి పంటల సాగును బంద్ చేసి తోటల సాగు చేపట్టారు. ఈ ఏడాది తోటలు సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు మొక్కలనుకొనుగోలు చేసుకోవాలని చెప్పడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. కొబ్బరి లాంటి మొక్కలను పొలాల గట్ల పై పెంచితే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఆలోచించి సబ్సిడీ పై మొక్కల సరఫరాతో పాటు పైపు లైను, డ్రిప్ పరికరాలను సరఫరా చేయాలని కోరుతున్నారు.

సబ్సిడీపై ఇస్తేనే పెడుత..



ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కొబ్బరి మొక్కలు ఇస్తదంటే మా పొలం గట్టు పైన నలుభై మొక్కలు నాటుదామని రాయించిన. ఇప్పుడు ప్రభుత్వం రైతులే మొక్కలు కొనుగోలు చేసుకుంటే తర్వాత బిల్లులు చెల్లిస్తామని చెప్పుతున్నారు. మేం మొక్కలు తెచ్చుకోవాలంటే నా వ్యవసాయ పనులు ఇడిసిపెట్టుకొని మొక్కలకు పోవాలే. ప్రభుత్వం ఇస్తే మంచి మొక్కలు ఇస్తారని నమ్మకం ఉంటది. మొక్కలు పెట్టుడు బంద్ చేసిన.

– పోశవేని కొమురయ్య, రైతు, కిషన్‌నగర్

రైతులే తెచ్చుకోవాలి



గతంలో ఉద్యావనశాఖ, ఉపాధి హామీ రెండు శాఖ సంయుక్తంగా మొక్కలు సరఫరా, డ్రిప్ లాంటి పరికరాలను సరఫరా చేసేది. ఇప్పుడు రైతులకు నచ్చి హైబ్రీడ్ మొక్కలు తెచ్చుకుంటే ఆ మొక్కల ధరలను బట్టి బిల్లుల ఉపాధిహామి పథకంలో చెల్లించే అవకాశం ఉంది. మొక్కలు కాతకు వచ్చే వరకు మూడేళ్లు ఉపాధి హామీ కూలీలతో పనులు చేయిస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్

నిర్వహణ ఖర్చు ఇస్తాం



రైతులకు పండ్ల తోటలపై అవగాహన కల్పిస్తే మండలంలో 32 ఎకరాల్లో సాగు చేయడానికి ముందుకొచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు మొక్కలు కొనుగోలు చేసుకొని బిల్లులు పెట్టుకుంటే ఉపాధి హామీ పథకంలో వారికి మొక్కకు నిర్దేశించిన ధర ప్రకారం బిల్లులు చెల్లిస్తాం.

– పద్మ, ఏపీఓ ,హుస్నాబాద్

చట్టాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ జడ్జి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రమేశ్

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జి రమేశ్ అన్నారు. బుధవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం భేటీ బచావో– భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ ఇస్నాపూర్‌లో న్యాయ చట్టాల పై సంయుక్త అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రమేశ్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందరూ లక్ష్యం చేరే వరకు ప్రయత్నం చేయాలన్నారు. అదే విధంగా కొత్తగా వచ్చిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినీయం గురించి వివరించారు. అనంతరం పటాన్‌చెరు ఎస్ఐ రాజేశ్ మాట్లాడుతూ... 1930, 100 హెల్ప్ లైన్ నంబర్స్ అందరూ ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో–ఆర్డినేటర్ పల్లవి మాట్లాడుతూ.. మిషన్ శక్తి స్కీమ్ లో భాగంగా మహిళలకు, ఆడపిల్లలకి సంబంధించిన సేవలను గురించి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీ, షీ టీం శివకుమార్, ముంతాజ్, విశాల, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాల ప్రకారం శిక్ష

అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి



మద్యం, వాహనాలతో పోలీసులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ వ్యాప్తంగా నూతన చట్టాలు అమలవుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించి నేరాలు చేస్తే కొత్త చట్టాల ప్రకారం నేరస్తులకు కఠిన శిక్షలు అమలవుతాయని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేసీఆర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు, యూనియన్ నాయకులు ఉద్యోగులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు.

లిక్కర్, గుట్కాలు సీజ్..

అంతకు ముందు అదే కాలనీ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఎలాంటి పేపర్లు లేని 20 మోటార్ సైకిళ్లు, 20 లీటర్లు లిక్కర్, రూ.10 వేల విలువ గల ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

సంగారెడ్డి: ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో బుధవారం ఇంటి ఎదుట రోడ్డుపై ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుక్కల గుంపు బాలుడిపై దాడి చేసింది. బాలుడి అరుపులతో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరిమి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం ఆస్పత్రికి తరలించారు. అధికారులు కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇద్దరు అదృశ్యం

బంధువుల ఇంటికొచ్చి యువకుడు

ఝరాసంగం(జహీరాబాద్):యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు కాలనీకి చెందిన చిట్టెంపల్లి దిలీప్ జూన్ 26న శుభకార్యం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రమైన ఝరాసంగం గ్రామంలోని బంధువుల ఇంటికొచ్చారు. 28న రాయికోడ్ మండలంలోని మహబత్‌పూర్ గ్రామంలో వివాహం ఉండటంతో ఝరాసంగం నుంచి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి దిలీప్ కనిపించకుండా పోయాడు. బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తల్లి చిట్టెంపల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ రెడ్డి వెల్లడించారు.

శివ్వంపేటలో యువతి

శివ్వంపేట(నర్సాపూర్): యువతి అదృశ్యమైన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రె నవ్య మంగళవారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లగా ఇంట్లో నుంచి వెళ్లి పయింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. బుధవారం యువతి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆస్తి తగాద విషయంలో అన్నను చంపిన తమ్ముడు, అతడి కుటుంబ సభ్యులను హద్నూర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. జహీరాబాద్ రూరల్ సీఐ నయిమొద్దీన్ కథనం మేరకు.. ఆస్తి విషయమై మంగళవారం మండల పరిధిలోని మల్గి గ్రామానికి చెందిన తెలుగు బాబును అతడిగ తమ్ముడు వైజ్యనాథ్, అతడి కుటుంబ సభ్యులు హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. నిందితుల కోసం గాలిస్తుండగా మండల పరిధిలోని కల్బేమల్ గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే నిందితులైన వైజ్యనాథ్, అతడి కుటుంబ సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

జేఎన్‌టీయూలో విద్యార్థుల ఆందోళన

హాస్టల్లో భోజనం సరిగా లేదని ఆరోపణ

సంగారెడ్డి : సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాలలో హాస్టల్ భోజనం సరిగా లేదని విద్యార్థులు బుధవారం సాయంత్రం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మెస్ కాంట్రాక్టర్ నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. ఆహార పదార్థాలు నోటిలో పెట్టుకోలేకపోతున్నామన్నారు. అర్ధకాలితో అలమటిస్తున్నామని మండిపడ్డారు. ఈ విషయమై యాజమాన్యం పట్టించుకోవాలన్నారు. వెంటనే అతడిని మార్చాలని డిమాండ్ చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ స్పందించి మెస్ కాంట్రాక్టర్‌ను మారుస్తామని, నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

అరుదైన పురాతన విగ్రహం గుర్తింపు



రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రమైన రాయపోలులోని గణపతి దేవాలయం ఆవరణలో అరుదైన పురాతన విగ్రహం గుర్తించినట్లు తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల పలుచోట్ల పరిశోధనలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాయపోలులోని గణపతి విగ్రహం దగ్గర కొన్ని విరిగిపోయిన విగ్రహాలున్నాయని, దీన్ని సిడితల వీరగల్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఆత్మహుతి చేసుకున్న వీరగల్లు విగ్రహంగా వివరించారు. రెండస్తులున్న ఈ వీరగల్లు విగ్రహంలో మొదటి అంతస్తులో ఓ వీరుడు కూర్చుని ఉండగా.. అతడి తల తెగి ఉందన్నారు. ఇలాంటి శిల్పాన్ని సిడితల వీరగల్లు అంటారని, ఇలాంటివి తెలంగాణలో ఇప్పటి వరకు పదికిలోపుగా లభించాయన్నారు. శైవ భక్తులు ఆత్మ బలిదానాలను ధర్మకార్యంగా, శివుని సన్నిధికి చేర్చే తక్షణమార్గంగా ఎంచుకునేవారని వివరించారు. అలాగే ఇక్కడ కొన్ని చాళుక్య, రాష్ట్ర కూటుల కాలానికి చెందిన శిల్పాలు కూడా ఉన్నట్లు తెలిపారు.

సిబ్బంది సమన్వయలోపంతో
విద్యుత్‌శాఖ ఉద్యోగి బలి

- ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా
- జేఎల్‌ఎం మృతి.. మరొకరికి గాయాలు
- మృతదేహాన్ని తరలించకుండా అడ్డగింత
- ఆరు గంటల పాటు ఉద్రిక్తత



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



చంద్రశేఖర్ (ఫైల్)



గాయపడ్డ మాణిక్యం

వట్‌పల్లి(అందోల్): విద్యుత్‌శాఖ సిబ్బంది సమన్వయలోపంతో ఆ శాఖ ఉద్యోగి బలయ్యాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఎర్రారం శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. డాకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రారం, డాకూరు గ్రామాల పరిధిలో బుధవారం రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు చేపట్టారు. డాకూరు పరిధిలో పనిచేస్తున్న జేఎల్‌ఎం శ్రీనివాస్ ముందుగా సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ కోసం (లైన్‌కట్) అనుమతి తీసుకొని పనులు ప్రారంభించాడు. అదే సమయంలో ఎర్రారం సబ్‌స్టేషన్ పరిధిలో జేఎల్‌ఎం చంద్రశేఖర్ కూడా ఎల్‌సీ కోసం అనుమతి తీసుకొని ఆర్టిజన్ కార్మికుడు మాణిక్యంతో కలసి ఎర్రారం శివారులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపడుతున్నారు. పని పూర్తయిందని ముందుగా ఎల్‌సీ తీసుకున్న డాకూరు జేఎల్‌ఎం శ్రీనివాస్ ఎల్‌సీని రిటన్ చేశాడు. అయితే.. చంద్రశేఖర్ ఎల్‌సీ తీసుకున్న విషయాన్ని సిబ్బంది గుర్తుకు పెట్టుకోకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మరమ్మతు పనుల్లో ఉన్న చంద్రశేఖర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు, ఆర్టిజన్ కార్మికుడు మాణిక్యం గాయాలతో బయటపడ్డాడు. చికిత్స కోసం హైదరాబాద్‌కి తరలించారు.

మృతదేహం తరలించకుండా అడ్డగింత

మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించేందుకు సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కుమార్ తమ సిబ్బందితో ప్రయత్నించగా కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇక్కడికి రావాలని బైఠాయించారు. ఆరుగంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించారు. అయినా అధికారులు రావాల్సిందేనని పట్టుబట్టారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్థానిక నాయకులు, అధికారుల ద్వారా మంత్రి దామోదర హామీనిచ్చారు. దీంతో బాధిత కుటుంబీకులతో చర్చలు జరిపి మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు కారకులైన సబ్‌స్టేషన్ ఆపరేటర్ పాపగారిన్ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈ తెలిపారు.

డీఈ, యూనియన్ నాయకుల చర్చలు

ప్రభుత్వ పరంగా మృతుడు చంద్రశేఖర్ కుటుంబానికి రావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వచ్చేలా చూస్తామని జోగిపేట ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ రాష్ట్ర యూనియన్ నాయకుడు భూంరెడ్డి తెలిపారు.

వివరాలు తెలుసుకున్న మంత్రి దామోదర

చంద్రశేఖర్ మృతి చెందిన విషయంపై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఘటనపై అధికారుల ద్వారా విచారణ జరిపించి బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా లభించే అన్ని సదుపాయాలను కల్పించే విషయమై చర్యలు తీసుకుంటుందని మంత్రి సూచించారు. ఈ సంఘటనలో గాయపడ్డ మాణిక్యంకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌తో స్వయంగా మాట్లాడి ఆదేశించారు.

మృతి కుటుంబాన్ని ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే

మృతుడు చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధికారులను కోరారు. గాయపడ్డ మాణిక్యంకు సైతం సాయం అందించాలని కోరారు.

ఊర కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కొండపాక(గజ్వేల్): ఊర కుక్కలు దాడిలో 15 గొర్రె మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన దుద్దెడ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గుర్రాల యాదయ్యకు వ్యవసాయ భూమి లేకపోవడంతో గొర్రెలను సాకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరి భాగంగా ఇంటికి సమీపంలో ఉన్న షెడ్డులో జీవాలను ఉంచాడు. మంగళవారం అర్ధరాత్రి వర్షం పడుతున్న క్రమంలో గొర్రెలపై ఊర కుక్కలు దాడి చేశాయి. వాటి అరుపులు విన్న యాదయ్య షెడ్డులోకి వెళ్లి చూడగా అప్పటికే 15 గొర్రెలు చనిపోయి ఉన్నాయి. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, పీఏసీఎస్ డైరెక్టరు శాలయ్య, మాజీ ఉప సర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు దోమల ఎల్లం, జక్కుల స్వామి, గుర్రాల కనకయ్య, నర్సింలు తదితరులు బాధితుడిని పరామర్శించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

నారాయణఖేడ్: మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారాయణఖేడ్ యువకుల అంత్యక్రియలు బుధవారం కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య జరిగాయి. పూణె జిల్లా ఇందాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అక్కడి పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. ఖేడ్ పట్టణానికి చెందిన రఫీక్ ఖురేషి(26), మహబూబ్ ఖురేషి (28) మృతదేహాలను అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. మధ్యాహ్న సమయంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఫిరోజ్ ఖురేషి(27), మజీద్ పటేల్(26) మృతదేహాలను నేరుగా అక్కడికి తరలించగా, కంగ్టికి చెందిన ఫిరోజ్ ఖురేషి(25) మృతదేహాన్ని కంగ్టికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ ఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ అమర్(25) పూణెలో చికిత్స పొందుతున్నాడు.

నేతల నివాళులు

ఖేడ్‌లో మృతదేహాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు సాగర్ షెట్కార్, తాహెర్ అలీ, ముంతాజ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. కంగ్టిలో మృతదేహానికి డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మనోజ్ పాటిల్, నాయకులు నాగన్న, శ్రీనివాస్ రెడ్డి, మైనొద్దీన్, రాజు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి.. డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- యువకుడు మృతి, ఇద్దరికి గాయాలు

గజ్వేల్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడితోపాటు వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన గట్టు రమేశ్ యాదవ్–లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు శ్రవణ్‌యాదవ్(16) ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇటీవలె 10వ తరగతి పూర్తి చేశారు. శ్రవణ్ తన మిత్రుడైన త్రినాథ్‌తో కలిసి పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే మార్గంలో బాలాజీ టిఫిన్ సెంటర్ సమీపంలో రోడ్డు దాటుతున్న కనకయ్య అనే వ్యక్తిని తప్పించబోయి వీరి బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న నడుపుతున్న త్రినాథ్‌తోపాటు రోడ్డు దాటుతున్న కనకయ్యలకు గాయాలయ్యాయి. బైక్ వెనుకాల కూర్చున్న శ్రవణ్‌యాదవ్ డివైడర్‌పై నుంచి రోడ్డుకు అవతలివైపు పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జక్కాపూర్ గ్రామానికి చెందిన నక్క కాంతయ్య (57) గుర్రాలగొంది‌లోని అంగడిలో కూరగాయలు అమ్ముకునేందుకు వెళ్లాడు. రాత్రి 8 గంటలకు గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. జక్కాపూర్ శివారు వద్దకు రాగానే సిరిసిల్ల నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు కాంతయ్యను ఢీకొట్టింది. స్థానికులు సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు కాంతయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాంతయ్యకు భార్య, నలుగురు కూతర్లు ఉన్నారు. కారులోని వ్యక్తులు వాహనాన్ని వది పరారైనట్లు, సిరిసిల్లకు చెందిన వ్యక్తులుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మరో ప్రమాదంలో వృద్ధుడు..

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. మండలంలోని పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన ముక్కపల్లి రాజయ్య(87) జ్వరం రావడంతో తిమ్మాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యం చేయించుకొని ఇంటికెళ్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న ఓ ఆటో రాజయ్యను ఢీకొట్టింది. వెంటనే సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.